పల్లె వాకిట్లో వైద్య సేవలు

- గ్రామాల్లో వెలసిన విలేజ్ క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే వైద్య పరీక్షలు
- పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం


కంసాలిపాలెంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం


తాళ్లపూడిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొవ్వూరు/నిడదవోలు రూరల్: వైద్యో నారాయణ హరి అంటూ వైద్యుడిని దేవుడిగా కొలిచేవారు. పుస్తకాల్లోనో, ఉపన్యాసాల్లోనో వినబడే ఈ మాట నేడు గ్రామాల్లో అక్షరాలా నిరూపితమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, వైఎస్సార్ క్లినిక్‌లు గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సత్ఫలితాలనిస్తున్నాయి.

ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసింది. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లు అమలు చేసింది. ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలను మరిన్ని పెంచారు. డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో 20 పీహెచ్‌సీలతో పాటు ఏకంగా 157 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి. విలేజ్ క్లీనిక్‌ల నిర్మాణానికి రూ.36.90 కోట్లు వెచ్చించింది. ఒక్కొక్క భవనానికి రూ.23.50 లక్షలు చొప్పున మంజూరు చేసింది. హెల్త్ క్లినిక్‌ల ద్వారా 12 రకాల వైద్య సేవ లతో పాటు 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడుగా ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని సేవలందిస్తున్నారు. దీని ద్వారా కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ 2,62,287 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో అనేక రకాలైన వ్యాధి గ్రస్తులున్నారు. డివిజన్ పరిధిలో ఉన్న 20 పీహెచ్‌సీ పరిధిలో 181 గ్రామ సచివాలయాలు, నిడదవోలు, కొవ్వూరు పురపాలక సంఘాల పరిధిలో 23 వార్డు సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 9,30,985 మంది జనాభా ఉన్నారు. వీరందరికీ వైద్య సేవలందుతున్నాయి.



గతంలో ఇదీ పరిస్థితి...

నిడదవోలు పట్టణానికి 7 కిలోమీటర్లు దూరంలో ఉన్న గ్రామం కంసాలిపాలెం. ఇక్కడ పేదోడికి వైద్యం అందడం కష్టంగా ఉండేది. రోగమొస్తే ఎప్పుడు తెల్లాతుందోనని ఎదురుచూడాల్సిన దుస్థితి ఉండేది. ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తే ఊరు చుట్టూ నీరు చేరడంతో వైద్యం అందక గ్రామ ప్రజలు నరకయాతన అనుభవించేవారు. పురిటినొప్పులు వస్తున్న గర్భిణులను ఎడ్లబండి, ట్రాక్టర్ల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. వైద్యులే గ్రామానికి వచ్చి సేవలందిస్తున్నారు. గ్రామస్తులు ఆనందం వ్యకం చేస్తున్నారు.


కంసాలిపాలెం-రావిమెట్ల రోడ్డుపై వరదనీటిలో గర్భిణిని ఎడ్లబండిపై తీసుకెళుతున్న దృశ్యం(ఫైల్)

డివిజన్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అందించిన వైద్య సేవలు

మొత్తం పీహెచ్‌సీల సంఖ్య	20
మొత్తం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	157
ఇప్పటి వరకూ వైద్య సేవలు పొందిన రోగుల సంఖ్య	2,62,287
సాధారణ ఓపీ	1,71,513
గర్భిణులు	6,942
బాలింతలు	4,454
రక్తహీనత ఉన్న వారి సంఖ్య	800
బీపీ	31,096
షుగర్	24,363
క్యాన్సర్	82
బ్రెస్ట్ క్యాన్సర్	74
గర్భాశయ క్యాన్సర్	262
టీబీ	324
బీపీ/షుగర్స్ వైద్య సేవలు పొందిన వారు	22,259

నిరంతరం పర్యవేక్షణ..

ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ- మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్-ఎంఎల్ హెచ్‌ఓ)ను టాస్క్‌ఫోర్స్ కమిటీకి లీడర్‌గా, ఏఎన్‌ఎం, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు కమిటీలో సభ్యులుగా ఉంటారు. నిరంతరం గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను గుర్తించి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు.

తిరిగే అవసరం లేకుండా..



ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నా. ఆరోగ్యశ్రీలో అన్ని రకాల పరీక్షలు చేసి, ఆపరేషన్ కూడా చేశారు. తరచూ పరీక్షలు చేయించుకునే అవసరం ఉంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉండడం, ఫ్యామిలీ డాక్టర్ ఇంటి రావడంతో ఆ అవసరం లేకుండా పోయింది. మా ఊళ్లేనే పరీక్షలు చేయించుకున్నా. మా కుటుంబానికి చాలా బాగా ఉపయోగ పడింది.

– పాటూరి నాగేశ్వరరావు, తాళ్లపూడి–1, తాళ్లపూడి మండలం

ఉచితంగా మందులు



గతంలో బీపీ, షుగర్ వ్యాధులకు మందులు ఇచ్చేవారు కాదు. సంపాదించిన డబ్బులన్నీ మందులకే ఖర్చు అయ్యేవి. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేయడంతో పాటు దీర్ఘకాలిక రోగాలకు ఉచితంగా మందులు ఇస్తున్నారు. నెలకు రెండు సార్లు వైద్య పరీక్షలు చేయిం చుకుంటున్నాం.

– పురంశెట్టి మాణిక్యం, కంసాలిపాలెం

మా ఊళ్లోనే వైద్యం



ఏదైనా జ్వరం వస్తే నిడదవోలు వెళ్లేవాళ్లం. ఇప్పుడు మా ఊర్లోనే విలేజ్ క్లినిక్ ద్వారా డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. మందులు కూడా ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం పేదలకు వైద్యం అందించేందుకు ఎంతో కృషి చేస్తోంది. కంసాలిపాలెంలో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మా బాగోగులు చూసుకుంటున్నారు.

– పరుచూరి సత్తెమ్మ, కంసాలిపాలెం

అందుబాటులో 14 రకాల వైద్య పరీక్షలు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. మలేరియా, డెంగీ వంటి పరీక్షలు చేస్తున్నాం. గర్భిణులకు వైద్య పరీక్షలు, ధూమపానం, మద్యంకు బానిసైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. షుగర్, బీపీ, నొప్పులతో బాధపడే వారు, వివిధ రకాల రోగాలకు గురైన వారికి చికిత్సతో పాటు యోగాపై అవగాహన కల్పిస్తాం. రోగులకు టెలి కన్సల్టేషన్ ద్వారా కూడా వైద్యసేవలు అందిస్తున్నాం.

– పి.రేవతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్,(ఎంఎల్‌హెచ్‌పీ), విలేజ్ క్లినిక్, బ్రాహ్మణగూడెం

నిలకడగా గోదావరి


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి వరద పరవళ్లు

కొవ్వూరు: గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం నుంచి కాస్తా తగ్గుముఖం పట్టినప్పటికీ మళ్లీ ఎగువున భద్రచలంలో పెరగడంతో ఇక్కడ గోదావరి నీటిమట్టం పెరిగింది. ఆదివారం సాయంత్రం నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల నుంచి గోష్పాదక్షేత్రం స్నానఘట్టం మెట్లు ముంపుబారిన పడ్డాయి. ఆదివారం సాయంత్రం నుంచి నెమ్మదిగా బయట పడుతున్నాయి.

గోదావరికి వరద

పెరవలి: గోదావరికి వరద పోటెత్తింది. లంకలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊహించని విధంగా రెండు రోజులుగా గోదావరికి వరదనీరు వస్తున్నా ఆదివారం మాత్రం నిలకడగా ఉంది. లంకల్లో వేసిన పంటలు కూరగాయలు మునిగిపోతాయని, దీని వలన ఆర్థికంగా ఇబ్బంది పడతామని ఆవేదన చెందుతున్నారు. ధవళేశ్వరం వద్ద ఆదివారం సాయంత్రానికి 8 లక్షల క్యూసెక్కుల నీరు వదలడంతో తోటలు ఏమవుతాయోనని రైతులు బెంబేలెత్తుతున్నారు.

రైతులపై కేంద్రం పెట్టిన కేసులు ఎత్తివేయాలి

గోపాలపురం: కేంద్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం దొండపూడి న్యూడెమక్రసీ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు చట్టాలను కేంద్రం దిగివచ్చి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షాలు రద్దు చేసినట్టు ప్రకటించడం హర్షనీయమన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అశువులు బాసిన రైతులకు నివాళులర్పించారు. ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త సదస్సుకు కార్మికులు, కర్షకులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ నాయకులు కుంపట్ల ఏసు, మారాజు శివ తదితరులు పాల్గొన్నారు.

కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టుపై నిరసన


కొవ్వూరు మెరకవీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపా రద్దు పోరాట సమితి నాయకులు

కొవ్వూరు: కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, ఆర్కె సహచరి శీరీషలను తక్షణం విడుదల చేయాలని కోరుతూ కొవ్వూరులో ఆదివారం ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలోని కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ ఇంటిపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) అధికారులు దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఊపా రద్దు పోరాట సమితి రాష్ట్ర కో–కన్వీనర్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ తప్పుబట్టారు. శిరీషను కూడా ఆమె స్వగ్రామమైన ప్రకాశం జిల్లా అలకూరుపాడులో అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏను జేబు సంస్థగా మార్చుకుని ప్రజా సంఘ నాయకులను, ప్రశ్నించే మేధావులను, ప్రొఫెసర్లను అక్రమ అరెస్టులు చేస్తోందని విమర్శించారు. అక్రమ అరెస్టులను తక్షణం నిలుపు చేయాలని, ఉపా చట్టం రద్దు చేయాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు గెడ్డం రవీంద్రబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాతకోకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల గంగాధర్ తిలక్‌కు నివాళి


తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్

ఉండ్రాజవరం: భారత జాతీయోద్యమ పితమహుడు బాల గంగాధర్ తిలక్ అని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ళ శ్రీనివాసరావు అన్నారు. ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి గుత్తికోండ కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం బాల గంగాధర్ తిలక్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిలక్ సేవలను కొనియాడారు. అనంతరం తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో పాఠకులు ఈద్పుగంటి సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, తిప్పర్తి గణపతి, పి.శ్రీనివాస్, పి.వెరియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

తాళ్లపూడి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న తాళ్లపూడికి చెందిన షేక్ సలీం వైద్య ఖర్చులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మానవత మండల అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతుల మీదుగా రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉపాధ్యక్షుడు అంకెం సురేష్ మానవత సభ్యులు తిగిరిపల్లి దోసాలు, ఎ.హనుమంతరావు, సనపల రాజశేఖర్, అప్పన గుప్త, పెమ్మాడి దుర్గాప్రసాద్, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

నల్లజర్ల: స్థానిక భగవాన్ శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టరు నల్లూరి వెంకటపతి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 119 మందికి వేమగిరికి చెందిన వైద్యనిపుణులు పరీక్షలు చేసి మందులు అందించారు. 19 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని గుర్తించారు. వీరికి వేమగిరిలో యోగానంద కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్టు సత్యసాయి సేవాసమితి మండల కన్వీనర్ గంటా శివరామారావు తెలిపారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు


అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు


అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషకాహార లోపాలు తలెత్తకుండా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం పెండ్యాల, సత్యవాడ, ఉండ్రాజవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా ఎంపికైన హెల్పర్లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. తమకు కేటాయించిన విధులను అంకితభావంతో చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సహాల మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, కారింకి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో కొత్తగా నియమితులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఆదివారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియామక పత్రాలు అందజేశారు. నల్లజర్ల మండలంలో దూలం గుబ్బలక్ష్మి, పాల్నాటి భవాని, వీరబోయిన దివ్యశ్రీ, మర్రే సత్యవాణి, దేవరపల్లి మండలంలో బందుల వివలక్ష్మి, లింగాల వీరమణి, కవల నాగలక్ష్మి, బిరుదుగడ్డ శాంతి, గోపాలపురం మండలంలో పాలుబోయిన లలిత, పామర్తి వీరలక్ష్మికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు.

ఆలయంలో 'ఆనందలహరి'


చిన్నారులకు సంగీత పాఠాలు నేర్పిస్తున్న టీచర్

నిడదవోలు: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో మూడో ఆదివారం శ్రీకృష్ణ ఆనందలహరి పేరిట చిన్నారులకు సండే స్కూల్ నిర్వహించారు. 5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు సంగీతం, యోగా, సూర్య నమస్కారాలు, ఆటలు, పాటలు, నీతి కథలు, కోలాటంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆలయం వద్ద సందడి చేశారు. పాఠశాల సెలవు దినాల్లో సెల్‌ఫోన్లతో సమయాన్ని వృథా చేస్తున్న చిన్నారులకు ఇటువంటి శిక్షణా శిబిరాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టి.సురేష్‌శాస్త్రీ, అందే కోటేశ్వరరావు, ఘంటా సుబ్బారావు, బండి సూర్యనారాయణ, సౌజన్య, గూడూరు వెంకటరమణ, అందే కోటేశ్వరరావు, కుసుమ ప్రియ, కె.రాణి, కె.మయూరి, బండి సూర్యకుమారి, కిషోర్‌వర్మ, కారింకి బేబి, కాకి శివకిషోర్, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో దాడులను అరికట్టాలి

ఉండ్రాజవరం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానుష దాడులను అరికట్టాలని అరుణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కత్తుల ప్రకాష్ అన్నారు. తాడిపర్రు గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటనలు యావత్‌భారత జాతిని తలదించుకునేలా చేసిందన్నారు. ఆడవారిపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇంత జరుగుతున్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం దారుణామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందాలపై దాడి

ద్వారకాతిరుమల: ఐఎస్ రాఘవాపురం పంచాయతీ తూర్ల లక్ష్మీపురం గ్రామంలో కోడి పందాల స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,450, కోడి, కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పెరవలి: అన్నవరప్పాడులో పుంత రోడ్డులో నిర్వహిస్తున్న కోడి పందాలపై పెరవలి పోలీసులు దాడి చేశారు.ఈ దాడిలో రూ.3 వేలు నగదు, 12 మంది జూదరులు, రెండు కోడి పుంజెలు, 10 మోటారుకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై సూర్య భగవాన్ తెలిపారు.

భార్యపై దాడి

కొవ్వూరు: తాగుడుకు బానిసైన భర్త తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడంటూ ఆదివారం ఓ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి... అమ్మఒడి సొమ్ములు తన బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు చెప్పలేదని ఐ.పంగిడికి చెందిన మనెల్లి చిరంజీవి భార్య స్వరూపను తలపై ఇటుకతో కొట్టి గాయపరిచారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరంజీవిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ కె.రామకృష్ణ తెలిపారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

నిడదవోలు రూరల్: మహిళల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండలంలోని కోరుమామిడి గ్రామంలో మహాశక్తి కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్య భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకొని వంట చేసుకొని సహపంక్తి భోజనం చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,86,121 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

అయ్యప్పకు అభిషేకాలు

నల్లజర్ల: అనంతపల్లిలోని రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పేరు మార్పు ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం, తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన **వంకాయల సతీష్ S/o శ్రీరామకృష్ణారావు** అను నేను తెలియజేయునది ఏమనగా నా టెన్త్‌క్లాస్ మార్క్స్ లిస్టులో మా నాన్న గారి పేరు రామకృష్ణ అని తప్పుగా పడినది ఇక నుండి అన్ని వ్యవహార కార్యకలాపాల్లో మా నాన్న గారి పేరు **శ్రీరామకృష్ణారావు** గా ఉండునని తెలియపరచడమైనది. ఇట్లు: **వంకాయల సతీష్**

బహిరంగ ప్రకటన

[illegible]

క్లుప్తంగా

నేడు మంత్రి వనిత పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత సోమవారం ఉదయం నుంచి చాగల్లు మండలం ఉనగట్ల, చగల్లు, తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.40 గంటలకు ఈనెల 25న కొవ్వూరు ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళా ఏర్పాట్లను మంత్రి పరిశీలిస్తారు.

25న మెగా జాబ్ మేళా

కొవ్వూరు: ఈనెల 25వ తేదీన కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ కోరారు. ఈ మేళాలో 31 ప్రముఖ కంపెనీలు ప్రతినిధులు వస్తున్నారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, వివిధ రకాల డిప్లమోలు చేసిన 18 ఏళ్లు నుంచి 45 ఏళ్ల లోపు నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

రక్తదాన శిబిరం

గోపాలపురం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని దొండపూడి సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు కోరారు. దొండపూడిలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సంజీవిని వలంటీర్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. తాళ్లపూడి మానవతా అధ్యక్షుడు గోకవరపు బాబులు మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. నాయకులు పోతిరెడ్డి నాగరాజు, ఎంపీటీసీ మారాజు రాజేష్, పోల్నాటి సురేష్, రాయుడు, దొండపూడి వర్తక సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులకు రేపు వేలం

చాగల్లు: నెలటూరు పంచాయతీ పరిధిలో మూడు చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు మంగళవారం ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ ఆదివారం తెలిపారు. లింగంచెరువు, తాడితోటగొయ్యి చెరువు, గుండాల చెరువులను వేలంపాట పాడుకునే వ్యక్తులు ముందుగా డిపాజిట్లు చెల్లించి పాల్గొవాలన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

చాగల్లు: మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ బి.రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. చిక్కాల(బీసీ-డీ జనరల్), (జనరల్ మహిళ), మార్కొండపాడు (బీసీ–మహిళ), కలవలపల్లి (జనరల్ మహిళ), (జనరల్) పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు జూలై 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామ్‌ప్రసాద్ చెప్పారు.

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిధిలోని వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 13 వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యేలు ఆదివారం తెలిపారు. అట్లపాడు–4 (ఎస్సీ–2), (బీసీ), (జనరల్), గోపవరం–2(ఎస్సీ), (జనరల్), మునిపల్లి (ఎస్టీ), పురుషోత్తపల్లి (బీసీ–2), రావిమెట్ల (బీసీ), (బీసీ–మహిళ), సూరాపురం (జనరల్), ఉనకరమిల్లి (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా గౌతమ్


గ్రంధి గౌతమ్

కొవ్వూరు: ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణానికి చెందిన గ్రంధి గౌతమ్ నియమితులయ్యారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బాల మురళీకృష్ణ చేతుల మీదుగా శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు తెలిపారు. గౌతమ్ నియమాకంపై ఆర్యవైశ్య సంఘం నాయకులు కొల్లేపర శ్రీనివాస్, కురపాటి బుజ్జి, వంకాయాల శివరామకృష్ణ, నాళం శ్రీనివాసరావు ,సత్యవరపు రంజిత్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెరవలి: పితృ వియోగం పొందిన కడింపాడు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దేవరపు శ్రీహరిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. శ్రీహరి తండ్రి నాగేశ్వరరావు ఇటీవల కన్నుమూశారు. ఆదివారం ఆయన చిత్ర పటం వద్ద ఎమ్మెల్యే నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కొత్తపల్లి అగ్రహారం, ఉసులుమర్రు, కాకరపర్రు, ముక్కామల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉండ్రాజవరం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు రాజనాల ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతుండడం వల్ల కండ్ల కలకలు వంటి సీజనల్ ఆరోగ్య సమస్యలు వస్తాయన్నాయని, దీనిపై అవగాహన ఉండాలన్నారు. ఈసందర్భంగా కండ్ల కలక లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సల గురించి వివరించారు. కండ్ల కలక కొన్ని రకాల ఎలర్జీ వల్ల వస్తుందని దీనికి సొంత వైద్యం, ఇంటి చిట్కాలు పాటించకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.